

**టన్ను చీనీ రూ.36 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 738 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.



**రక్తదాత సుఖీభవ**

అత్యవసర సమయంలో ఓ వ్యక్తికి రక్తం అందించడంలో కన్నా మరో గొప్ప దానం లేదు. 8లో




జిల్లా పరిధిలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ తేలిక పాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### ప్రశాంతతే లక్ష్యంగా భద్రతా చర్యలు

- ఎస్పీ మాధవరెడ్డి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

మడకశిర రూరల్: గ్రామాల్లో ఎక్కడా గొడవలు తలెత్తకుండా ప్రశాంతంగా ఉండే విధంగా భద్రతా చర్యలు తీసుకోవాలని ఎస్పీ మాధవ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ముదిగుబ్బ, పట్నం పోలీస్‌స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లాకప్ గదులను పరిశీలించారు. అక్కడి పరిస్థితులపై సమీక్షించారు. రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను ఆరా తీశారు. గ్రామాల్లో ప్రశాంతత లోపించకుండా శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. సమస్యాత్మక గ్రామాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రౌడీషీటర్ల కదలికపై నిఘా ఉంచాలన్నారు. రాత్రి వేళల్లో పోలీస్ గస్తీ ముమ్మరం చేయాలన్నారు. ఎవరైనా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడితే చట్టపరంగా గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ యతీంద్ర, ఎస్‌ఐ నరసింహులు తదితరులున్నారు.

### నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్‌క్వాష్ అధికారులు

తాడిమర్రి: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఢిల్లీకి చెందిన నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (యన్‌క్వాష్) డాక్టర్లు అభిషేక్ సుభాష్ గోసవి, రాతికాంత సాహూ వైద్యాధికారులకు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెండోరోజూ వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నిల్వచేసిన మందులు, టీకాలను పరిశీలించారు. అలాగే ఆస్పత్రిలోని గదులు, మరుగుదొడ్ల శుభ్రతపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వైద్య చికిత్సల కోసం వచ్చే ప్రజలను విసుక్కోకుండా ప్రేమ, ఆప్యాయతతో పలకరించి వైద్య చికిత్స అందించాలన్నారు. కాన్పుల కోసం వచ్చే వారిని జాగ్రత్తగా పర్యవేక్షించి తల్లీబిడ్డ క్షేమంగా ఉండేలా వైద్య చికిత్స అందించాలన్నారు. ప్రజలకు నమ్మకం కలిగించేలా వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హరిత, గోవర్ధన్‌నాయుడు, సీహెచ్‌ఓ హేమలత, ఎంపీహెచ్‌ఈఓ నారాయణమ్మ, ఎంపీహెచ్‌ఎస్ రామ్‌కుమార్, పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి, ల్యాబ్ టెక్నీషియన్ మస్తాన్, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

### జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక



జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

హిందూపురం టౌన్: జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంజీఎం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం జిల్లా సబ్ జూనియర్స్, జూనియర్స్ బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపికలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారిలో 20 మంది చొప్పున రెండు జట్లకు 40 మందిని క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు అనీల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా సబ్ జూనియర్స్, జూనియర్స్ బాలికల ఫుట్‌బాల్ జట్లకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

### హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్నాలజీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: వెంకటగిరిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)లో డిప్లొమా హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్నాలజీ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి రమేష్ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు, ఇంటర్ పూర్తి చేసుకొన్న వారు అర్హులన్నారు. గరిష్ట వయో పరిమిత 25 సంవత్సరాలని, మొదటి సంవత్సరం నెలకు రూ. వెయ్యి , రెండో సంవత్సరం నెలకు రూ.2 వేలు, మూడో సంవత్సరం నెలకు రూ. 3 వేల చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9866727042, 8185881331, 9866160008 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## • మోగిన బడిగంట

వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు మళ్లీ బడి బాట పట్టారు. జిల్లాలో 2078 స్కూళ్లు ఉండగా అందులో 1,46,155 మంది విద్యార్థులు చదువుతున్నారు. తొలిరోజు గురువారం అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మొదటిరోజే పుస్తకాలను అందించారు. – పుట్టపర్తి:



హిందూపురం : కగ్గల్లు ఎంపీపీ పాఠశాలలో సరస్వతీ పూజతో తరగతులను ప్రారంభిస్తున్న విద్యార్థులు



పుట్టపర్తి: పాతదేవరపల్లిలో కొత్త పుస్తకాలను చూపుతున్న విద్యార్థులు

# డిజిటల్ పేమెంట్లకు జై

- పెరుగుతున్న డిజిటల్ లావాదేవీలు
- సులభంగా నగదు చెల్లింపులు
- చిరు వ్యాపారులు సైతం మొగ్గు
- పల్లె నుంచి సిటీ దాకా అందరూ ఆన్‌లైన్ బాట
- భారీగా తగ్గిన నగదు లావాదేవీలు



సాక్షి, పుట్టపర్తి: జేబులో చిల్లిగవ్వ లేకపోయినా.. ఫర్వాలేదు. బ్యాంకు ఖాతాలో నగదు ఉండి స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు. కావాల్సిన వస్తువులు కొనుగోలు చేయొచ్చు. నచ్చిన ఫుడ్ తినవచ్చు. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్స్. ఇప్పుడు వీధి వ్యాపారాల్లోకి కూడా వచ్చేసింది. చిరు వ్యాపారులు సైతం నగదు రహిత లావాదేవీలకు అలవాటుపడ్డారు. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ పేమెంట్సే కనిపిస్తున్నాయి. కొబ్బరి బొండాలు, పానీపూరి, కూరగాయలు, పండ్ల అమ్మకాలు ఇలా అన్నీ డిజిటల్ పేమెంట్స్ కొనసాగుతున్నాయి. పట్టణాల నుంచి మారుమూల పల్లెల వరకు డిజిటల్ పేమెంట్స్ అందుబాటులోకి వచ్చాయి.

**పరిస్థితులకు అనుగుణంగా..**

2016లో పెద్దనోట్లు (రూ.500, రూ.1000) రద్దుతో డిజిటల్ పేమెంట్లు మొదలయ్యాయి. అయితే అప్పట్లో ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదు. మాల్స్, పెద్ద వ్యాపార సంస్థల్లో మాత్రమే కార్డు ద్వారా డిజిటల్ లావాదేవీలు జరిగేవి. పట్టణాల్లో మాత్రమే అంతో ఇంతో ప్రాచుర్యం పొందినా గ్రామాల్లో డిజిటల్ పేమెంట్ల గురించి తెలియక భయపడేవాళ్లు. అయితే కరోనా కారణంగా నగదు లావాదేవీలకు జనాలు భయపడ్డారు. అప్పటికే గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం ప్రాచుర్యం పొందడంతో చాలా మంది నగదు రహిత లావాదేవీలు చేసేందుకే మొగ్గు చూపారు.

**చిరు వ్యాపారులు సైతం...**

టీ స్టాళ్లు, కాకా హోటళ్లు, తోపుడు బండ్లు, సైకిళ్లపై రోడ్ల పక్కన, ఇంటింటికీ తిరుగుతూ ఫాస్ట్‌ఫుడ్స్, కూరగాయలు, పండ్లు వంటివి అమ్మే వ్యాపారులకు ఆన్‌లైన్ చెల్లింపులు ప్రయోజనకరంగా మారాయి. చిల్లర సమస్యతో గతంలో బేరాలు పోయేవని. ప్రస్తుతం అలాంటి సమస్య లేదని చిరు వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ పేమెంట్లతో ఎలాంటి నష్టం లేదని చెబుతున్నారు. పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఏ దుకాణం వద్ద చూసినా పేమెంట్ క్యూఆర్ కోడ్‌లు దర్శనం ఇస్తున్నాయి.

**స్పీకర్ బాక్సులతో మోసాలకు చెక్..**

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసాలకు అంతే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరుకులు కొనుగోలు చేసిన తర్వాత వేరే ఖాతాకు నగదు బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై సక్సెస్‌ఫుల్ మెసేజ్‌ను దుకాణదారుడికి చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. అయితే ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు స్పీకర్ బాక్సులు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా డిజిటల్ మోసాలకు చెక్ పడుతోంది.

**బ్యాంకుల్లోనూ తగ్గిన నగదు లావాదేవీలు..**

బ్యాంకుల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగదు లావాదేవీలు చాలావరకు తగ్గిపోయాయి. వినియోగదారులు అధికంగా క్యాష్‌లెస్ ట్రాన్సాక్షన్‌లు చేస్తూ ఇంటి వద్ద నుంచి అన్ని రకాల సేవలు పొందుతున్నారు. ఫలితంగా బ్యాంకులకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని చెబుతున్నారు. మరోవైపు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది.

**ఆన్‌లైన్ చెల్లింపులే అధికం..**

ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, అమెజాన్ పే తదితర పేమెంట్ యాప్ సేవలతో అన్ని చోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, హోటళ్లు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జులు, కరెంటు బిల్లులు, గ్యాస్ బిల్ తదితర లావాదేవీలన్నీ మొబైల్ పేమెంట్ యాప్‌ల ద్వారానే సాగుతున్నాయి. పేమెంట్ యాప్‌లు వినియోగిస్తున్న వారిలో యువత ముందు వరుసలో ఉంటున్నారని ఆయా సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు.




**ఇప్పుడు చిల్లర సమస్య లేదు**



నగదు రహిత లావాదేవీలతో వ్యాపారం సులభం. నేను భైరాపురంలో ఫాస్ట్‌ఫుట్ సెంటర్ నిర్వహిస్తున్నాను. గతంలో చిల్లర సమస్య ఉండేది. ఇప్పుడు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా చిల్లర సమస్యతో పాటు వ్యాపారం సులువుగా మారింది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వచ్చే వాళ్లందరూ ఎక్కువగా డిజిటల్ ద్వారానే చెల్లింపులు చేస్తున్నారు. – బాబ్‌జాన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు, కొత్తచెరువు

**ఫోన్ ద్వారానే నగదు చెల్లిస్తున్నా..**



గూగుల్ పే, ఫోన్‌పే లాంటి ఆన్‌లైన్ యూపీఐ పేమెంట్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత వాటి ద్వారానే నగదును అందజేయడానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నా. హడావుడిలో బయటకు వెళ్లేటప్పుడు డబ్బులు మరిచిపోయినా, ఇబ్బందిపడే పరిస్థితులు ఇప్పుడు లేవు. ఫోన్ ద్వారానే నగదును చెల్లిస్తున్నా. ఇప్పుడు చిన్న చిన్న దుకాణాల్లోనూ యూపీఐ పేమెంట్లు అందుబాటులో రావడంతో అన్నిచోట్లా ఆన్‌లైన్ పేమెంట్లు చేస్తున్నా. – దేవరాజు, హిందూపురం

**అన్నీ ఆన్‌లైన్ చెల్లింపులే..**



వివిధ రకాల పండ్లను అమ్మడం ద్వారా నేను జీవనం సాగిస్తున్నాను. పుట్టపర్తిలో ఇప్పుడు చాలామంది ఆన్‌లైన్ ద్వారానే డబ్బులు చెల్లిస్తున్నారు. గతం కంటే ఇటీవల కాలంలో కూడా ఆన్‌లైన్ పేమెంట్లు చేస్తున్న వారి సంఖ్య పెరిగింది. యుపీఐ పేమెంట్లతో చిల్లర సమస్య కూడా లేదు. ఆన్‌లైన్ చెల్లింపు చేయడం ద్వారా మోసాలు కూడా జరగవు. – బాబ్‌జాన్, వ్యాపారి, పుట్టపర్తి

## అధైర్య పడొద్దు.. అండగా ఉంటా



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

- వైస్ ఎంపీపీపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడటం హేయం
- మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదని, తాను అండగా ఉంటానని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ భరోసా ఇచ్చారు. పరిగి మండల వైస్ ఎంపీపీ వేదవతి, ఆమె భర్త నరసింహారెడ్డిపై శ్రీరంగరాజుపల్లి పంచాయతీ పరిధిలోని ముల్లమోతుకపల్లిలో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల దాడికి పాల్పడటం హేయమన్నారు. గురువారం ఆమె పరిగి మండలానికి వచ్చారు. తొలుత మొల్లమోతుకపల్లిలో జరిగిన దాడి ఘటనపై వైస్ ఎంపీపీ వేదవతి, ఆమె భర్త నరసింహారెడ్డితో ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వాలు మారడమనేది సహజమని, అయితే అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఇలాంటి హింసాత్మక ఘటనలకు పాల్పడటం అప్రజాస్వామ్యమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అల్లర్లు, దాడులు పెట్రేగిపోయాయని విమర్శించారు. గోరంట్ల మండలం గుర్రం తండాలో మహిళలపై దాడి చేశారని, సోమందేపల్లిలో మైనార్టీ సోదరి ఇంటికెళ్లి మరీ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం సిగ్గు చేటన్నారు. దాడులపై న్యాయపోరాటం చేస్తామని పార్టీ శ్రేణులకు భరోసా కల్పించారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులకు బీజేపీ కూడా బాధ్యత వహించాన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

## అత్యుత్సాహం



జగనన్న కాలనీ పేరును పరిటాల శ్రీరామ్‌నగర్‌గా మారుస్తూ ఏర్పాటు చేసిన నేమ్‌బోర్డు

ధర్మవరం: ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తల అత్యుత్సాహం ఎక్కువవుతోంది. ఇంత వరకూ సచివాలయాల మీద దాడులు, శిలాఫలకాలు ధ్వంసం చేసి ఆనందపడిన టీడీపీ కార్యకర్తలు తాజాగా జగనన్న కాలనీల పేర్లు మారుస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. పట్టణంలోని ధర్మవరం–పుట్టపర్తి ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న జగనన్న కాలనీలను పరిటాల శ్రీరామ్ కాలనీ, నగర్‌గా మారుస్తూ బండలపై పేర్లు రాశారు.

## కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలి

- శిక్షణ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మంజువాణి

హిందూపురం టౌన్: కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడినవారమవుతామని వైద్యాధికారులకు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలకు జిల్లా వైద్యాశాఖధికారిణి డాక్టర్ మంజువాణి సూచించారు. గురువారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్యాధికారులకు క్షేత్రస్థాయి సిబ్బందికి 'కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మంజువాణి, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న, జిల్లా ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణ అధికారి డాక్టర్ కేసీకే నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న ప్రజల జీవనశైలి వలన రోజు రోజుకూ కేన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. లక్షణాలు లేని కేన్సర్ వ్యాధిగ్రస్తుల గుర్తింపే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే వారిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చాన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులు, గ్రామాల్లో అనునిత్యం పర్యటించే ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు శిక్షణ కార్యక్రమం అనంతరం ప్రాథమిక దశలోనే వ్యాధి గుర్తించి, అలాంటి వారిని ఉన్నతస్థాయి ఆస్పత్రిలో సరైన చికిత్స అందజేయడానికి సూచనలు ఇవ్వాలన్నారు. చాప కింద నీరులా విస్తరిస్తున్న కేన్సర్‌ను మొక్కదశలోనే తుంచేయాలన్నారు. పొగాకు ఉత్పత్తులు, వాడకాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తే నోటి కేన్సర్లు చాలావరకు దరిచేరవని సూచించారు. అనవసరమైన గర్భస్రావాలు నివారణ వలన గర్భాశయ కేన్సర్లను నివారించవచ్చని సూచించారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు పద్మజ, విజయ్ బాబు, నీరజా, ఆయిషా తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి



మడకశిర పట్టణంలో వర్షం కురుస్తున్న దృశ్యం



పుట్టపర్తి పరిధిలో కళకళలాడుతున్న ముందస్తు వేరుశనగ

## 16 మండలాల్లో వర్షం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని 16 మండలాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ వర్షం కురిసింది. అత్యధికంగా ధర్మవరంలో 29.4 మి.మీటర్లు, కదిరిలో 20.2 , కనగానపల్లి, బత్తలపల్లి 18.6, తాడిమర్రి 18.4, నల్లచెరువు 15.4, రామగిరి 14.8, ఓడీ చెరువు 10.4, ముదిగుబ్బ 8.6, తలుపుల 8.4, గాండ్లపెంట, బుక్కపట్నం 7.2, ఎన్పీ కుంట, నల్లమాడ 6.4, సీకేపల్లి, తనకల్లు మండలంలో 5.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. వర్షాలతో ముందస్తుగా సాగు చేసిన వేరుశనగ పంట కళకళ లాడుతోంది. కూరగాయల పంటలు కూడా ఆశాజనకంగా ఉన్నాయి.

## క్లుప్తంగా

### మెరుగైన వైద్య సేవలు అందించాలి


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీడీ శివశంకరప్రసాద్

సోమందేపల్లి: గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత సిబ్బందిని వైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివశంకరప్రసాద్ ఆదేశించారు. సోమందేపల్లి మండలం జూల కుంట, బ్రహ్మ సముద్రం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ప్రతి గురువారం క్షయ వ్యాధి నిర్మూలనకు తప్పక బీసీజీ టీకాలు వేయాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పీపీఎం నాగేంద్ర, వైద్యుడు, ఓంకార్, టీబీ సూపర్‌వైజర్ గౌస్, సీహెచ్ఓ మనోహర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రవీంద్ర, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

### విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్‌ను అపహరించుకెళుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గురువారం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ చంద్రశేఖర్ వెల్లడించారు. కంబదూరు మండలం వెంకటంపల్లి, కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లి, బోరంపల్లి, ముద్దినాయనపల్లిలో ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్లను దోచుకెళ్లారు. ఆయా ఘటనలపై రైతుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పక్కా ఆధారాలతో గురువారం ఉదయం బోరంపల్లి వద్ద కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన చాకలి రాఘవేంద్ర, ఎర్రిస్వామిని కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని వారు అంగీకరించారు. వారి నుంచి 150 కిలోల రాగి వైర్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

# రక్తదాత సుఖీభవ

సందర్భం: నేడు రక్తదాతల దినోత్సవం





హిందూపురంలోని జిల్లాస్పత్రిలో రక్తదానం చేస్తున్న యువకులు (ఫైల్)

హిందూపురం/అర్బన్: రక్త దానం.. ఈ పేరు వినగానే ఓ మనిషికి మరో మనిషి చేసే అతి పెద్ద గొప్ప సాయం ఏదైనా ఉందా అంటే అది రక్తదానమేనని చెబుతుంటారు. రక్తదానానికి మించిన దానం మరొకటి లేదని నిరూపితమైంది. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఒకరి నుంచి దానంగా తీసుకున్న రక్తంతో ఎందరో పునర్జన్మ పొందారు. ఈ క్రమంలో రక్తదానం ఆవశ్యకతపై ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు విస్తృతమయ్యాయి. 1901లో ఆస్ట్రేలియాకు చెందిన కార్ల్‌లాండ్ స్టీనర్ మొదట రక్తాన్ని వర్గీకరించారు. దీంతో ఆయన పుట్టిన జూన్ 14న ప్రపంచ రక్తదాన దినోత్సవంగా ప్రకటించి, మొట్టమొదటి సారిగా 2004లో రక్తదాత దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి గత 20 ఏళ్లుగా ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినం జరుపుకుంటున్నారు.

**ఒకప్పుడు ప్రాధేయపడినా..**

గతంలో అత్యవసరమని ప్రాధేయపడిన రక్తదానం చేసేందుకు ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. అత్యవసర సమయంలో రక్తం అందక అప్పట్లో చాలా మంది మృత్యువాత పడుతూ వచ్చారు. ఈ క్రమంలో రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన అతి కొద్ది మంది అత్యవసర సమయంలో రక్తదానంతో వ్యక్తి ప్రాణాలు ఎలా కాపాడవచ్చో నిరూపితం చేస్తూ ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు ముమ్మరం చేశారు. రక్తాదానం మనిషి ప్రాణాలను కాపాడుతుందని, అన్ని దానాల కల్లా రక్తదానం గొప్పదనే అంశాన్ని ప్రజల మదిలో బలంగా నాటుకుపోయేలా చేశారు. రక్తదానాన్ని ఉద్యమంలా తీసుకెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించి ప్రాణదాతలుగా మారే బృహత్తర అవకాశాన్ని కల్పించారు. జిల్లాలో నేడు వేలాది మంది తమ రక్తాన్ని స్వచ్ఛందంగా దానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. ముందస్తుగానే బ్లడ్ బ్యాంక్‌ల్లో రక్తం నిల్వలు ఉండేలా చొరవ చూపడంతో పాటు అత్యవసర సమయంలో ఎంత దూరమైనా ప్రయాణించి రక్తదానం చేస్తున్నారు.

**రక్తదానం వల్ల లాభాలు..**

క్రమం తప్పకుండా రక్తదానం చేయడం వల్ల మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని నిపుణులు చెబుతున్నారు. గుండె జబ్బుల ప్రమాదాన్ని పూర్తిగా తగ్గిస్తుందని అంటున్నారు. రక్తప్రసరణ మెరుగు పడి బీపీ నియంత్రణలో ఉంటుంది. క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చు. బరువు తగ్గడానికి దోహద పడుతుంది. రక్తదానం చేసినప్పుడు శరీరం కోల్పోయిన రక్త కణాలను తిరిగి నింపుతుంది. ఎముక మజ్జ తాజా రక్త కణాలను ఉత్పత్తి చేస్తుంది. రక్తదానం చర్మానికి మేలు చేస్తుంది. మొటిమలు, ఇతర చర్మ సంబంధిత రుగ్మతలు తొలిగిపోతాయి. అన్నింటి కంటే ముఖ్యంగా రక్తదానం వల్ల ఒకరి ప్రాణం నిలబడుతుంది.

| జిల్లాలోని బ్లడ్ బ్యాంక్‌ల్లో నిల్వల సామర్థ్యం ఇలా... | | |
|---|---|---|
| కేంద్రం | నిల్వ సామర్థ్యం | దాతల సంఖ్య |
| పుట్టపర్తి (ఎస్ఎస్ఎస్ ట్రస్ట్) | 2 వేల యూనిట్లు | 500 మంది |
| హిందూపురం | 500 యూనిట్లు | 2,300 మంది |
| కదిరి | 500 యూనిట్లు | 1,200 మంది |
| ధర్మవరం | 50 యూనిట్లు | 300 మంది |
| పెనుకొండ | 30 యూనిట్లు | 100 మంది |
| మడకశిర | 30 యూనిట్లు | 60 మంది |

### రక్తదానం చేస్తుంటా



దాదాపు పది ఏళ్లకు పైగా నేను రక్తదానం చేస్తూనే ఉన్నా. ప్రతి మూడు నెలలకోసారి అత్యవసరమని ఫోన్ వస్తే ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేసి వస్తాను. ఇప్పటి వరకూ 106 సార్లు రక్తదానం చేశాను.

– వెంకటేష్‌బాబు, కూల్‌డ్రింక్ షాపు యజమాని, హిందూపురం

### అవగాహన పెరగాలి



రక్తదానం వల్ల మన ఆరోగ్యం బాగుంటుంది. అంతేకాక మరొకరి ప్రాణం నిలబడుతుంది. ఇప్పటి వరకూ నేను 80 సార్లు రక్తదానం చేశాను. రక్తదానంపై అపోహలు వీడాలి. ముఖ్యంగా యువత రక్తదానానికి ముందుకు రావాలి.

– సుబ్రహ్మణ్యం, వ్యాపారి, హిందూపురం

### ఆత్మీయత పెరుగుతుంది



అత్యసవర సమయంలో రక్తదానం చేయడంతో పాటు మరింత మందిని చైతన్య పరిచి రక్తదానం చేయిస్తుంటాను. ఇప్పటి వరకూ 58 సార్లు నేను రక్తదానం చేశాను. రక్తదానం వల్ల కులమతాలు, ధనికపేద అనే భేదభావం నశించి ఆత్మీయత పెరుగుతుంది.

– ఉమర్‌ఫరూక్, స్వచ్ఛంద సేవ కార్యకర్త, హిందూపురం.

### ఈవీఎం మహత్యంతోనే కూటమి ప్రభుత్వాలు

- ఈవీఎంలు వద్దు... బ్యాలెట్ పేపర్ ముద్దు పేరుతో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ
- బీఎస్పీ నాయకులు శ్రీరాములు, కొల్లకుంట నాగరాజు

హిందూపురం: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల మహత్యంతోనే అటు కేంద్రంతో పాటు ఇటు రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయని బీఎస్పీ నాయకులు విమర్శించారు. మోదీ అలింగనం చేసుకున్న వారు హీరోలు కాదని, వారంతా రాజకీయంగా జీరోలేనని ఎద్దేవా చేశారు. గురువారం హిందూపురంలో బీఎస్పీ నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో నాయకులు శ్రీరాములు, కొల్లకుంట నాగరాజు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో విచిత్రమైన ఓటింగ్ జరిగినట్లుగా కనిపిస్తోందన్నారు. నిరంతర పోరాటాలతో ప్రజలకు సుపరిచితుడైన హిందూపురం బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాములుకు అతి తక్కువ ఓట్లు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. కొన్ని బూత్‌ల్లో ఒక ఓటే పోలవ్వడం చూస్తుంటే ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసినట్లుగా స్పష్టమవుతోందన్నారు. అలాగే ఎంపీ అభ్యర్థి కొల్లకుంట భాగమ్మకు ఒకటి రెండు తప్పితే ఏ బూత్‌లోనూ డబల్ డిజిట్ ఓట్లు పోలవక పోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. బీఎస్పీకి బలమైన క్యాడర్ ఉన్న హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ముద్దిరెడ్డిదండు రోడ్డు 28వ పీఎస్‌లో ఆ పార్టీ అభ్యర్థికి 5 ఓట్లు, విశేష ప్రజాదరణ పొందిన వైఎస్సార్‌సీపీకి ఒక్క ఓటు, టీడీపీకి 95 ఓట్లు పోలవ్వడం తమ అనుమానాలకు ఊతమిస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ పార్టీకి 464 ఓట్లు రావడం చూస్తుంటే ఈవీఎంలను ఎంతలా ట్యాంపరింగ్ చేసారో అర్థం చేసుకోవచ్చునన్నారు. జరిగిన ఎన్నికలపై ఎలాంటి దర్యాప్తు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. దీంతో «ఈవీఎంలు వద్దు.. బ్యాలెట్ పేపర్ ముద్దు» నినాదంతో భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా కోశాధికారి హరికుమార్, నాయకులు మూర్తి, నారాయణ, మౌలాలీ, ఖలందర్, బాబు, చిరంజీవి, నరసింహప్ప, సత్తెప్ప, అంజనప్ప, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల కాపరిపై ఎలుగుబంటి దాడి

రాయదుర్గం రూరల్: ఎలుగుబంటి దాడిలో గొర్రెల కాపరి గాయపడ్డాడు. వివరాలు... రాయదుర్గం మండలం చదం గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల జడప్ప గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం 10.30 గంటలకు తనకున్న గొర్రెలను మేపునకు గ్రామ సమీపంలోని గట్ట మల్లేశ్వర కొండ వెనుక వైపు తోలుకెళ్లాడు. ఆ సమయంలో ఉన్నఫళంగా పొదల్లో నుంచి వచ్చిన ఎలుగుబంటి... జడప్ప ఎడమకాలిపై దాడి చేసింది. తేరుకున్న ఆయన వెంటనే చేతిలో ఉన్న కర్రతో ఎదురుదాడికి దిగుతూ గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని మరికొందరు కాపర్లు అక్కడకు చేరుకుని ఎలుగుబంటిని తరిమేశారు. క్షతగాత్రుడిని రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

## సిరుల పూబంతి

- మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.90
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


చిన్నపప్పూరులో సాగుచేసిన బంతిపూల పంట

పెద్దపప్పూరు: బోలెడు పెట్టుబడులు పెట్టి నష్టాలు చవిచూసేకన్నా, బోరుబావులకింద తక్కువ పెట్టుబడితో సాగు చేసిన బంతి పూల తోటలు రైతుల్లో ఆశలు చిగురింప చేస్తున్నాయి. ప్రస్తుతం పంట కోత ప్రారంభంలోనే మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.90 ధర పలుకుతుండడంతో ఆశించిన రీతిలో పంట దిగుబడితో పాటు ఆదాయాన్ని పొందుతున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలోని పెద్దపప్పూరు, తాడిపత్రి, యాడికి, మండలాల్లో బంతి, చామంతి పంటలను దాదాపు 102 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఈ మేరకు అధికారుల ఈ–క్రాప్ బుకింగ్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం అనంతపురం, తాడిపత్రి తదితర పట్టణాల్లోని మార్కెట్లలో కిలో బంతిపూలు రూ.50 నుంచి రూ.90 వరకు ధర పలుకుతోంది. బంతి, చామంతి మేలైన రకాల మొక్కలను చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి తెప్పించి సాగుచేస్తున్నారు. నాటిన 50 రోజుల నుంచి నెలరోజుల పాటు పూలు కోతకు వస్తాయి. ఎకరాకు నేల స్వభావాన్ని బట్టి 2 టన్నుల నుంచి 4 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. పంట సాగు కోసం ఎకరాకు రూ.40 వేల నుంచి రూ. 50 వేల వరకూ ఖర్చువుతుందంటున్నారు. ఈ లెక్కన రైతులకు బంతి పూల సాగు లాభదాయకంగా ఉందని అంటున్నారు.



### ఆనందం.. సాయి చరణం


సంగీత కచేరీ నిర్వహిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన హరియాణ, చండీఘడ్ ప్రాంత సత్యసాయి భక్తులు గురువారం సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఉదయం 'ఆనందం సాయి చరణం' పేరుతో సంగీత కచేరి నిర్వహించారు. సాయంత్రం హరి తుమ్ అనా హరియాణ పేరుతో హిసార్‌కు చెందిన సత్యసాయి బాలికల సీనియర్ సెకెండరీ స్కూల్ విద్యార్థులు నాటిక ప్రదర్శించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

### టీడీ పల్లిలో పర్యటించిన స్పెయిన్ బృందం


చిన్నారి శ్రీజతో ముచ్చటిస్తున్న ఆనా

రొళ్ల: మండలంలోని టీడీపల్లిలో గురువారం స్పెయిన్ బృందం పర్యటించింది. కొన్నేళ్ల క్రితం ఆర్డీటీ తరఫున ఈ ప్రాంతంలో పర్యటించిన స్పెయిన్ దేశస్తురాలు ఆనా... ఆ సమయంలో ద్రాక్షాయిని, మంజునాథ్ దంపతుల కుమార్తె శ్రీజతో పాటు హనుమక్క, హనుమంతరాయప్ప దంపతుల కుమారుడు నరసింహమూర్తిని దత్తత తీసుకున్నారు. దీంతో ఏడాదికోసారి ఇక్కడకు వచ్చి చిన్నారులతో పాటు వారి కుటుంబసభ్యులను పరామర్శించి వెళుతుంటారు. ఇందులో భాగంగానే గురువారం టీడీపల్లికి చేరుకున్న ఆమె చిన్నారులతో సరదాగా గడిపారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యా సామగ్రి, దుప్పట్లు, వివిధ రకాల ఆట వస్తువులు, స్వీట్లు, చాక్లెట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం ఎస్సీ కాలనీల్లో స్పెయిన్ బృందం సభ్యులు పర్యటించారు. అక్కడి వారి ఆచార వ్యవహారాలను అధ్యయనం చేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ ఓబులేసు, ఆర్డీటీ సిబ్బంది, సీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

### కొడవళ్లు పట్టుకుని చంపుతామంటూ...

- అనంతపురం రూరల్ కక్కలపల్లిలో టీడీపీ కార్యకర్తల హల్‌చల్

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలు కొడవళ్లు పట్టుకుని చంపుతామంటూ భయోత్పాతం సృష్టించారు. అయితే తనను హత మార్చేందుకే వచ్చారంటూ సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య వాపోయాడు. ఆయన తెలిపిన వివరాలు... గురువారం సాయంత్రం గ్రామ సమీపంలోని తన తోటలో సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య, మరో ఇద్దరితో ఉన్నాడు. వర్షం కురుస్తుండడంతో షెడ్డులోకి వెళ్లారు. అదే సమయంలో తన డ్రైవర్ చాంద్‌బాషా బయట ఉన్న వాహనం వద్దకెళ్లినప్పుడు అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు నాగార్జున, సుధీర్‌రెడ్డి కొడవళ్లు చేతుల్లో పట్టుకుని కనిపించారు. సర్పంచ్‌ను చంపుతామని హెచ్చరించడంతో భయాందోళనకు గురైన చాంద్ బాషా వెంటనే షెడ్డులోకి వెళ్లి కృష్ణయ్యకు విషయం తెలిపాడు. దీంతో తలుపులు వేసి వెంటనే పోలీసులు, సమీప బీజేపీ కాలనీలోని కొందరికి ఆయన ఫోన్లు చేశారు. బీజేపీ కాలనీ నుంచి కొందరు రావడంతో సర్పంచ్ షెడ్డు నుంచి బయటకు రావడం చూసిన నాగార్జున, సుధీర్‌రెడ్డి అక్కడి నుంచి పరారయ్యారు. ఇంతలో సీఐ రామకృష్ణారెడ్డి కూడా అక్కడికి చేరుకుని, గాలింపు చేపట్టారు. సర్పంచ్ తోట సమీపంలోని భవిష్య డ్రిప్ కంపెనీ వద్ద కనిపించిన మరో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు పోలీసులను చూడగానే ఉడాయించారు. సీఐ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా ఇలాంటి ఘటనలకు పాల్పడితే తాట తీస్తామని హెచ్చరించారు. గ్రామాలు ప్రశాంతంగా ఉండాలని అనవసరంగా గొడవలకు పాల్పడి అలజడులు సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

## మహిమాన్వితం.. కాశీవిశ్వేశ్వరాలయం

- దాదాపు ఆరు శతాబ్దాల ఘన చరిత్ర
- కోరిన కోర్కెలు తీర్చే బోళాశంకరుడు
- వారం పొడవునా విశేష అభిషేకాలు



విశేష అలంకరణలో దర్శనమిస్తున్న శివలింగం, కాశీవిశ్వేశ్వర ఆలయం


చూసొద్దాం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రం బుక్కరాయసముద్రం సమీపంలో ముసలమ్మ కట్ట వద్ద వెలసిన కాశీ విశ్వేశ్వర ఆలయం అత్యంత మహిమాన్వితమైన క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడ వెలసిన భోళాశంకరుడిని పూజిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని ప్రసిద్ధి. పచ్చని చెట్ల నడమ ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన ఈ ఆలయంలో వారం పొడవునా విశేష అభిషేకాలు నిర్వహిస్తుంటారు. ప్రత్యేకించి సోమవారం నాడు ఇక్కడి శివలింగానికి అభిషేకించి హరహర మహాదేవ శంభో శంకరా....అంటూ ప్రార్థిస్తే జన్మ సుకృతమవుతుందని పెద్దలు అంటున్నారు.

**ఆలయ చరిత్ర..**

బుక్కరాయసముద్రం – అనంతపురం నగరం మధ్యన ముసలమ్మ కట్ట వద్ద వెలసిన కాశీ విశ్వేశ్వరాలయానికి దాదాపు ఆరు వందల సంవత్సరాల ఘనమైన చరిత్ర ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అప్పట్లో కాశీ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన శివలింగాన్ని ఇక్కడ ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఆలయానికి దక్షిణాన శ్మశాన వాటిక ఉంది. దీంతో ఈ ఆలయాన్ని దక్షిణ కాశీగా అభివర్ణిస్తుంటారు. ప్రధాన ఆలయం పక్కనే ఉప ఆలయాలూ ఉన్నాయి. గర్భగుడి ఎదుట పుష్కరిణి ఎంతో చూడముచ్చటగా ఉంది. భూగర్భంలోనే ఉండిపోయిన ఈ పుష్కరిణిని కొన్ని దశాబ్దాల క్రితం గుర్తించి అభివృద్ధి చేశారు. ఉప ఆలయాల్లో వెలసిన కాశీ విశాలాక్షి, వినాయక, సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్ప స్వామి ఆలయాల్లోనూ రోజూ విశేష పూజలు నిర్వహిస్తుంటారు. ప్రత్యేకించి ఆది, సోమ, మంగళ, శుక్రవారాల్లో అమ్మవారి ఆలయంలో, బుధవారం నాడు వినాయక మందిరంలో ఆది, మంగళ వారాల్లో సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు పెద్ద ఎత్తున సాగుతుంటాయి. ఆలయ ప్రాంగణంలో వెలసిన నాగుల కట్ట, నవగ్రహాల వద్ద నిర్ణీత రోజుల్లో పూజలు నిర్వహిస్తే సకల దోషాలు పరిహారమవుతాయని భక్తుల నమ్మకం.


**ప్రళయాన్ని తట్టుకుని...**

ప్రళయం అందులోను జలప్రళయం సంభవిస్తే భూమి పై ఏమీ మిగలదని చరిత్రకారులు చెబుతుంటారు. సమస్త జీవరాశి ఆ జలప్రళయంలో కొట్టుకుపోవల్సిందేనని అంటుంటారు. మరి అంతటి జలప్రళయాన్ని కూడా తట్టుకుని నిలబడే శక్తి కేవలం ఈ ఒక్క ప్రాంతానికే ఉందని ఆలయ చరిత్ర చెబుతోంది. 'పూర్వం భారీ వర్షం కారణంగా బుక్కరాయసముద్రం చెరువు మొత్తం నిండిపోయింది.అయినా వర్షం కుండపోతగా కురుస్తుడడంతో ఆ చెరువు కట్ట తెగిపోయి నీరు మొత్తం ఊరిలోకి ప్రవేశిస్తున్నాయి. భయభ్రాంతులైన గ్రామ ప్రజలు గ్రామ దేవత అయిన పోలేరమ్మను ప్రార్థిస్తే.. చెరువు చుట్టూ చేరిన ప్రజలను ఉద్దేశించి ఆకాశవాణి మాట్లాడుతుంది. ఈ ప్రమాదం నుంచి గ్రామ ప్రజలను కాపాడాలంటే అదే ఊరిలో నివసిస్తున్న బసిరెడ్డి చిన్న కోడలు ముసలమ్మని చెరువుకట్టకు బలి ఇస్తే జల ప్రళయం నిలుస్తుందని చెబుతుంది. దీంతో తన ప్రాణ త్యాగంతో గ్రామ ప్రజలను ముసలమ్మ కాపాడుతుంది'. నాడు సంభవించిన జల ప్రళయంలోనూ కాశీవిశ్వేశరాలయం చెక్కు చెదరకుండా నిలిచి ఉంది. అంతేకాక ప్రాణత్యాగంతో జల ప్రళయాన్ని నివారించిన ముసలమ్మను కీర్తిస్తూ ఆమెను దేవతాస్వరూపంగా గ్రామ ప్రజలు కొలుస్తూ వచ్చారు. ముసలమ్మ పేరుతో కాశీవిశ్వేశ్వర ఆలయం సమీపంలోనే ప్రత్యేకంగా ఆలయాన్ని నిర్మించి, పూజాదికాలు నిర్వహిస్తున్నారు.

**స్పర్శ దర్శనంతో అభిషేకాలు..**

మహా శివలింగాన్ని స్వయంగా చేతితో తాకి మొక్కాలని ప్రతి ఒక్కరూ భావిస్తుంటారు. అయితే ఆలయ ధర్మాలు అందుకు అంగీకరించకపోవడంతో ఈ కోరిక నెరవేరకుండా పోతోంది. అయితే కాశీలో తరహాలోనే బుక్కరాయసముద్రంలో వెలసిన కాశీవిశ్వేశ్వరాలయంలోనూ స్పర్శదర్శనంతో అభిషేకాలు నిర్వహించే బృహత్తర అవకాశం ఆది నుంచి వస్తోంది. ఆలయం ఆవిర్భవం నుంచి ఈ పంథాను కొనసాగిస్తూ వస్తున్నట్లు పెద్దలు అంటున్నారు. దీంతో ప్రతి సోమవారం ఆలయంలో మహాశివుడికి అభిషేకాలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారు. అయితే ఆలయ నిబంధనల మేరకు భక్తులు తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాల్సి ఉంటుంది. వివాహాది శుభకార్యాలు జరుపుకునేందుకు ఆలయ ప్రాంగణంలో సువిశాలమైన కల్యాణమంటపాన్ని నిర్మించారు. కార్తీకం, మాఘ మాసాల్లో ఉమ్మడి జిల్లాతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు.

### పీఠం ఏర్పాటు


పీఠాధిపతి అన్నామలై స్వామి

కాశీ విశ్వేశ్వరాలయానికి ప్రత్యేకించి ఓ పీఠాన్ని ఏర్పాటు చేశారు. పీఠాధిపతులుగా వ్యవహరించిన వారిలో మణిస్వామి ముఖ్యులు. ఎందరో భక్తుల సాదకబాధకాలను ఆయన దూరం చేశారనే ఖ్యాతి ఉంది. 2017, జనవరి 5న ఆయన శివైక్యం చెందారు. అనంతరం అదే ఏడాది ఫిబ్రవరిలో ఆలయ పీఠాధిపతిగా అన్నామలై స్వామి బాధ్యతలు స్వీకరించి, శివారాధనపై ప్రజలను చైతన్య పరుస్తూ ఆలయ అభివృద్ధికి బాటలు వేశారు. ఆయన బోధనలతో చైతన్యం పొందిన వేలాది మంది ఏటా శివ మాల ధరించి జీవన స్థితిగతులను మెరుగు పరుచుకుంటున్నారు.